సాక్షి కర్నూలు

బుధవారం : 5 : జూన్ : 2024



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై వనపర్తి శ్రీదేవి బృందం నిర్వహించిన సంప్రదాయ నృత్యప్రదర్శన అలరించింది.



నందీశ్వరుడికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో శనగల బసవన్నగా పేరుగాంచిన నందీశ్వరునికి మంగళవారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు.



వీరభద్రుడికి ప్రత్యేక పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్రపాలకుడిగా ప్రసిద్ధిగాంచిన బయలువీరభద్ర స్వామికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంకు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో



హొళగుంద: కర్ణాటకలోని హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర డ్యాంకు మంగళవారం ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. గత శనివారం 270 క్యూసెక్కులున్న ఇన్‌ఫ్లో డ్యాం పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో మంగళవారం 659 క్యూసెక్కులకు పెరిగింది. డ్యాంలో ప్రస్తుతం 3.462 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రాయబసవన కాలువకు 25 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గతేడాది రిజర్వాయర్‌లో ఇదే సమయానికి 1,580.94 అడుగుల వద్ద 4.944 టీఎంసీల నీరు ఉండేవి. అయితే ఇన్‌ఫ్లో 1,053 క్యూసెక్కులుండేది. నైరుతి పవనాలు రావడం, ఆగస్ట్ 15 వరకు వర్షాలు కురిసే అవకాశాలుండడంతో త్వరలోనే ఇన్‌ఫ్లో పెరిగి డ్యాం నిండ వచ్చని టీబీ బోర్డు అధికారులు తెలిపారు.

వైద్యశిబిరాల పరిశీలన



వైద్యశిబిరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని రాయలసీమ యూనివర్సిటీలో కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. ఆయా వైద్యశిబిరాలు ఉద్యోగులకు అందుతున్న వైద్యసేవలు, ఇస్తున్న మందుల గురించి ఆరా తీశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మొత్తం నాలుగు కేంద్రాల వద్ద నాలుగు వైద్యశిబిరాలు ఏర్పాటు చేసింది. ప్రతి వైద్యశిబిరంలో ఒక మెడికల్ ఆఫీసర్, ఒక నర్సు, ఒక అటెండర్ ఉన్నారు. దీంతో పాటు రెండు పడకలను ఏర్పాటు చేసి ఒక జనరల్ మెడిసిన్, ఒక ఆర్థోపెడిషియన్‌ను అందుబాటులో ఉంచారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ రాజీనామా




రాజీనామా లేఖను చూపుతున్న సుభాష్

కర్నూలు (టౌన్): జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ తన పదవికి రాజీనామా చేశారు. మంగళవారం సాయంత్రం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా సమస్యలపై మరింత బలంగా పోరాడుతామన్నారు. ఓటమి తాత్కాలికమే అని, భవిష్యత్తు వైఎస్సార్‌సీపీదే అన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా అవకాశం కల్పించిన జగనన్నకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. జగనన్నతో పాటు రాజకీయాల్లో చివరి దాకా ప్రజాక్షేత్రంలో పనిచేస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఎన్నికైన ఎంపీ, ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు వెల్లడించారు.

మహానందిలో భక్తుల సందడి

మహానంది: మహానందిలో మంగళవారం భక్తుల రద్దీ కొనసాగింది. వేలాది మంది భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు కిక్కిరిశాయి. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం 5.30 గంటలకు అష్టవిధ మహా మంగళ హారతులతో ప్రారంభమైన స్వామి, అమ్మవారి దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. భక్తులు ఆలయ ప్రాంగణాల్లోని నవనందుల్లో ప్రముఖమైన వినాయకనందీశ్వరస్వామి, గరుడనందీశ్వరస్వామి ఆలయాలను సందర్శించారు.

కుందూ...కనువిందు



నిండుకుండలా ఉన్న కుందూ నది

దొర్నిపాడు: ప్రస్తుతం కురిసిన వర్షాలకు కుందూనది నిండుకుండలా కనువిందు చేస్తోంది. ఇన్నాళ్లుగా ఎడారిలా ఉన్న కుందూ ప్రస్తుతం జలకళ సంతరించుంది. నదికి నీటి రాకతో తాగు, సాగు నీటికి సమస్య ఉండదని క్రిష్టిపాడు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కూటమికే పట్టం

సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో మెజార్టీ స్థానాలు కైవసం

- జిల్లాలో ఐదింట కూటమి, రెండు స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం
- కర్నూలు పార్లమెంట్ స్థానాన్నీ దక్కించుకున్న టీడీపీ
- నంద్యాల జిల్లా పాణ్యం అసెంబ్లీలోనూ పాగా
- ఆలూరు అసెంబ్లీ ఫలితంపై సందిగ్ధత.. ఆలస్యంగా డిక్లరేషన్



ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రంలోకి తీసుకెళ్తున్న సిబ్బంది



కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ ఫలితాలను వెల్లడిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన



కౌంటింగ్ హాల్‌లో పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కిస్తున్న ఎన్నికల సిబ్బంది

సాక్షి ప్రతినిధి కర్నూలు: సార్వత్రిక పోరులో తెలుగుదేశంపార్టీ కూటమి ఆధిక్యత సాధించింది. జిల్లాలో 7 అసెంబ్లీ స్థానాల్లో 5 చోట్ల విజయం సాధించింది. కర్నూలు పార్లమెంట్ స్థానాన్ని కూడా కైవసం చేసుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రెండు చోట్ల గెలుపొందింది. ఇదిలాఉంటే నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గాన్ని కూడా తెలుగుదేశం పార్టీ దక్కించుకుంది. జిల్లాలోని 7 అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానానికి గత నెల 13న పోలింగ్ జరిగింది. రాయలసీమ యూనివర్సిటీలో ఎన్నికల అధికారి డాక్టర్ సృజన ఆధ్వర్యంలో కౌంటింగ్ నిర్వహించారు. వీటితో పాటు నంద్యాల జిల్లా పాణ్యం అసెంబ్లీ కౌంటింగ్ కూడా ఇక్కడే చేపట్టారు. మొదట పోస్టల్ బ్యాలెట్‌లను, ఆ తర్వాత ఈవీఎంలను లెక్కించారు.

మొదట వైఎస్సార్‌సీపీ ఆధిక్యం చూపినా..

కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, ఆదోని, పత్తికొండ నియోజకవర్గాల కౌంటింగ్‌లో మొదట వైఎస్సార్‌సీపీ ఆధిక్యంలో కొనసాగింది. ఆపై పత్తికొండలో టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు ఆధిక్యత ప్రదర్శిస్తూ వచ్చారు.

- ఎమ్మిగనూరులో కూడా 7వ రౌండ్ నుంచి జయనాగేశ్వరరెడ్డి ఆధిక్యత ప్రదర్శించారు.
- కోడుమూరు నియోజకవర్గం నుంచి ఆదిమూలపు సతీష్ మొదటి 10 రౌండ్లలో ఆధిక్యంలో కొనసాగారు. ఆపై బొగ్గుల దస్తగిరి ఆధిక్యత సాధించారు.
- ఆదోనిలో కూడా మొదట సాయిప్రసాద్‌రెడ్డి ఆధిక్యంలో కొనసాగినా, చివరకు బీజేపీ అభ్యర్థి పార్థసారధి గెలుపొందారు.
- ఆలూరులో నువ్వా-నేనా అంటూ సాగిన పోటీలో చివరకు విరూపాక్షి 2,831 ఓట్లతో గెలుపొందారు. అయితే రీకౌంటింగ్ చేయాలని టీడీపీ ఏజెంట్లు పట్టుబట్టారు. ప్రతీ రౌండ్‌లోనూ ఏజెంట్లు సంతకాలు చేసిన తర్వాతనే ఆ తర్వాతి రౌండు లెక్కించారు. దీంతో ఎన్నికల అధికారి సృజన రీకౌంటింగ్‌ను తిరస్కరించారు. అయితే డిక్లరేషన్ ఇవ్వడంలో జాప్యం తలెత్తింది. దీంతో విరూపాక్షితో పాటు వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు కాసేపు ఆందోళన చెందారు. రీకౌంటింగ్ పేరుతో టీడీపీ ఏదో మాయాజాలం చేయాలని చూస్తోందని భావించారు. అయితే చివరకు విరూపాక్షికి డిక్లరేషన్ అందించారు.
- మంత్రాలయంలో కూడా టీడీపీ, వైఎస్సార్‌సీపీ మధ్య కొన్ని రౌండ్లు ఆధిక్యత మారుతూ వచ్చినా చివరికి బాలనాగిరెడ్డి విజయం సాధించారు.
- పాణ్యం, కర్నూలు నియోజకవర్గాల్లో మొదటి నుంచి టీడీపీ అభ్యర్థులు గౌరు చరితారెడ్డి, టీజీ భరత్ ఆధిక్యత ప్రదర్శించి గెలుపొందారు.

పార్లమెంట్ స్థానం టీడీపీదే

కర్నూలు పార్లమెంట్ నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున రామయ్య, టీడీపీ తరఫున బస్తిపాటి నాగరాజు బరిలో నిలిచారు. ఇక్కడ కూడా తొలి రౌండు నుంచి నాగరాజు ఆధిక్యత ప్రదర్శించారు. రామయ్యపై 1,05,875 ఓట్లతో నాగరాజు గెలుపొందాడు.

144 సెక్షన్ అమలు

కౌంటింగ్ నేపథ్యంలో కౌంటింగ్ సెంటర్‌కు రెండు కిలోమీటర్ల మేర 144 సెక్షన్ అమలు చేశారు. భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అభ్యర్థులు, ఏజెంట్లు, అధికారులు, మీడియా ప్రతినిధులను మాత్రమే పంపారు. ఏజెంట్లకు బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించి కౌంటింగ్ సెంటర్‌లోకి అనుమతించారు.

అంతుచిక్కని ఫలితాలు

కర్నూలు, నంద్యాల జిల్లా ఫలితాలు విశ్లేషకులకు అంతు చిక్కడం లేదు. వైఎస్సార్‌సీపీకి కంచుకోటగా ఉన్న ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇలాంటి ఫలితాలు అందరినీ విస్మయానికి గురి చేశాయి. 2012లో ఆళ్లగడ్డ, ఎమ్మిగనూరుకు జరిగిన ఉప ఎన్నికల్లో రెండు స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపొందింది. ఆపై 2014లో 2 ఎంపీలతో పాటు 11 అసెంబ్లీలు కైవసం చేసుకుంది. టీడీపీ అధికారం చేపట్టినా అప్పటి కర్నూలు జిల్లాలో కేవలం 3 అసెంబ్లీలు మాత్రమే గెలుపొందింది. 2019లో 2 ఎంపీలతో పాటు 14 అసెంబ్లీలను క్లీన్‌స్వీప్ చేసింది. ఆ తర్వాత జరిగిన మునిసిపల్ పోరులో అన్నింటినీ దక్కించుకుంది. స్థానిక సంస్థల్లో కూడా అన్ని జెడ్పీటీసీలను గెలిచి జిల్లా పరిషత్ కైవసం చేసుకుంది. అన్ని మండల పరిషత్‌లు కూడా వైఎస్సార్‌సీపీనే గెలుపొందింది. ఇంత ఆధిక్యత ప్రదర్శించిన జిల్లాలో ఇలాంటి ఫలితాలు విస్మయాన్ని కలిగిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీకి ఏ అంశం ప్రతికూలంగా మారింది? టీడీపీ అభ్యర్థులకు ఏ అంశం అనుకూలంగా మారింది? అనేది కూడా అంతుచిక్కని పరిస్థితి.

నియోజకవర్గాల వారీగా అభ్యర్థులకు పోలైన ఓట్లు

నియోజకవర్గం	గెలుపొందిన అభ్యర్థి పేరు	పార్టీ	పోలైన ఓట్లు	ఓడిపోయిన అభ్యర్థి పేరు	పోలైన ఓట్లు	మెజార్టీ
మంత్రాలయం	వై.బాలనాగిరెడ్డి	వైఎస్సార్‌సీపీ	87,662	ఎన్. రాఘవేంద్ర రెడ్డి	74,857	12,805
పత్తికొండ	కె.ఇ.శ్యాంబాబు	టీడీపీ	98,849	కంగాటి శ్రీదేవి	84,638	14,211
కర్నూలు	టి.జి.భరత్	టీడీపీ	91,690	ఎ.ఎం.డి. ఇంతియాజ్	72,814	18,876
పాణ్యం	గౌరుచరితా రెడ్డి	టీడీపీ	1,37,743	కాటసాని రాంభూపాల్ రెడ్డి	99,234	38,509
కోడుమూరు	బొగ్గుల దస్తగిరి	టీడీపీ	1,01,703	ఆదిమూలపు సతీష్	80,120	21,583
ఆదోని	డాక్టర్ పార్థసారథి	బీజేపీ	88,943	వై.సాయిప్రసాదరెడ్డి	71297	17,646
ఆలూరు	విరూపాక్షి	వైఎస్సార్‌సీపీ	1,00,264	వీరభద్రగౌడ్	97,433	2,831
ఎమ్మిగనూరు	బి. జయనాగేశ్వరరెడ్డి	టీడీపీ	1,01,212	బుట్టారేణుక	86,396	14,816
కర్నూలు పార్లమెంట్	బస్తిపాటి నాగరాజు	టీడీపీ	6,48,782	బీవై రామయ్య	5,42,907	1,05,875



కేఈ శ్యాంబాబు



టీజీ భరత్



జయనాగేశ్వరరెడ్డి



బొగ్గుల దస్తగిరి



డాక్టర్ పార్థసారథి



గౌరు చరితారెడ్డి



బస్తిపాటి నాగరాజు

తిరుగులేని నేతగా బాలనాగిరెడ్డి

- మంత్రాలయం నుంచి నాలుగోసారి జయకేతనం



మంత్రాలయం: యల్లారెడ్డి గారి బాలనాగిరెడ్డి తిరుగులేని నేతగా నిరూపించుకున్నారు. మంత్రాలయం నియోజకవర్గం నుంచి నాల్గవ సారి సైతం విజయ బావుటా ఎగురవేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, నటుడు బాలకృష్ణ ప్రచారం చేసినా టీడీపీ అభ్యర్థి ఎన్ రాఘవేంద్ర రెడ్డి గట్టెక్కలేకపోయారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో మంత్రాలయం నియోజకవర్గం నుంచి మొత్తం 8 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వై.బాలనాగిరెడ్డి, టీడీపీ అభ్యర్థి ఎన్. రాఘవేంద్ర రెడ్డి మధ్య ప్రధాన పోటీ సాగింది. మంత్రాలయం నియోజకవర్గంలో మొత్తం 2,08,350 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు, 1,02,155 మంది, మహిళలు 1,06,172 మంది, ఇతరులు 23 మంది ఉన్నారు. అందులో 1,76,077 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 84.51 శాతం పోలింగ్ నమోదైంది. కర్నూలు జిల్లా కేంద్రంలోని రాయలసీమ యూనివర్సిటీలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సి. విశ్వనాథ్ నేతృత్వంలో ఓట్ల లెక్కింపు సాగింది. మంగళవారం ఉదయం 8గంటల నుంచి కౌటింగ్ మొదలైంది. 17 రౌండ్ల గణన ప్రక్రియ జరిగింది. మొదటి రౌండ్‌లో టీడీపీ 341 ఓట్ల మెజార్టీతో బోణీ చేసుకుంది. తక్కిన రౌండ్లలో వైఎస్సార్ సీపీ ఆధిక్యత కొనసాగించింది. 17వ రౌండ్ ముగిసిన సమయానికి 12,805 ఓట్ల మెజార్టీతో బాలనాగిరెడ్డి విజయం సాధించారు. మంత్రాలయం నుంచి విజయం సాధించిన వై. బాలనాగిరెడ్డికి 87,662 ఓట్లు, టీడీపీ అభ్యర్థి ఎన్. రాఘవేంద్ర రెడ్డికి 74,857 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థికి మురళీ కృష్ణంరాజుకు 4,660 ఓట్లు , బీఎస్పీ అభ్యర్థి గుడిపి సామేల్‌కు 3589 ఓట్లు, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థి ఆర్. రాఘవేంద్ర రెడ్డికి 608 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థులు ఎం. రాఘవేంద్ర రెడ్డికి 624 ఓట్లు, కె. నాగిరెడ్డికి 353 ఓట్లు, సి. పరమేష్‌కు 297 ఓట్లు , నోటాకు 2,674 ఓట్లు వచ్చాయి.

జెడ్పీటీసీ సభ్యుడి నుంచి ఎమ్మెల్యేగా..

- ఆలూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా విరూపాక్షి విజయం



కర్నూలు(అర్బన్): జిల్లాలోని చిప్పగిరి జెడ్పీటీసీ సభ్యుడు బూసినె విరూపాక్షి ఆలూరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2020 మార్చిలో మొదటి విడతగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో చిప్పగిరి జెడ్పీటీసీ సభ్యుడిగా విరూపాక్షి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జెడ్పీటీసీ సభ్యునిగా చిప్పగిరి మండలంలోని పలు సమస్యలను జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలు, స్థాయీ సంఘ సమావేశాల్లోనూ లేవనెత్తి వాటి పరిష్కారానికి కృషి చేస్తూ వచ్చారు. చిప్పగిరి జెడ్పీటీసీగా ఉంటూనే ఆలూరు నియోజకవర్గ రాజకీయాలపై ఆసక్తి పెంచుకొని ప్రస్తుతం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అక్కడి నుంచి పోటీ చేశారు. విరూపాక్షికి 1,00,264 ఓట్లు రాగా.. సమీప తెలుగు దేశం అభ్యర్థి వీరభద్రగౌడ్‌కు 97,433 ఓట్లు వచ్చాయి. మొత్తం 2,831 ఓట్ల మెజారిటీతో విరూపాక్షి విజయం సాధించారు. జెడ్పీటీసీ సభ్యుడిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన విరూపాక్షి వెనుకబడిన ఆలూరు నియోజకవర్గ సమస్యలపై రాష్ట్ర అసెంబ్లీలో తన గళాన్ని వినిపించనున్నారు.

ప్రశాంతంగా కౌంటింగ్

- ఊపిరి పీల్చుకున్న పోలీసు అధికారులు



బందోబస్తు విధుల్లో సాయుధ పోలీసులు

కర్నూలు: కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా ముగిసింది. దీంతో జిల్లా పోలీసు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ముందస్తు కార్యాచరణతో పోలీసు శాఖ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేస్తూ నిఘాను కట్టుదిట్టం చేశారు. పోలింగ్ రోజు కూడా చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా సాగింది. రాయలసీమ యూనివర్సిటీలో మంగళవారం చేపట్టిన ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా సాగడంతో పోలీసు ఉన్నతాధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఎలాంటి రాజకీయ గొడవలకు ఆస్కారం లేకుండా నంద్యాల చెక్‌పోస్టు నుంచి బి.తాండ్రపాడు వరకు జాతీయ రహదారిలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ప్రధాన రాజకీయ పార్టీల కార్యకర్తలు ఆ ప్రాంతానికి రాకుండా కట్టడి చేస్తూ ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిఘా నీడలో పూర్తి చేశారు.

వెయ్యి మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు

కర్నూలు(సెంట్రల్): సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాయలసీమ యూనివర్సిటీలో కర్నూలు పార్లమెంట్‌తోపాటు కర్నూలు, పాణ్యం, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, ఆదోని, పత్తికొండ అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్‌ను ఉదయం 8 గంటల నుంచి చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలుచోటు చేసుకోకుండా వెయ్యి మంది పోలీసులతో నాలుగెంచల భద్రత కల్పించారు. కాగా.. కౌంటింగ్ ప్రక్రియ ఆలస్యంగా జరిగింది. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు లెక్కించారు. కర్నూలు పార్లమెంట్‌కు సంబంధించిన ఓట్ల లెక్కింపు కోసం రాత్రి 11 గంటల వరకు సమయం పట్టింది. మొదటి ఫలితం సాయంత్రం 4.30 గంటలకు వచ్చింది.

పోలీస్ ఆదేశాలు బేఖాతర్!



ఆదోని పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు: ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థుల విజయోత్సవ ర్యాలీలపై పోలీసులు ఆంక్షలు విధించినప్పటికీ అమలుకు నోచుకోలేదు. ఫలితాలు వెలువడుతుండగానే టీడీపీ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున కార్యకర్తలు గుమికూడి బాణసంచా పేలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా విక్రయాలపై నిషేధం విధించినప్పటికీ నగరంలోని టీడీపీ నాయకుల ఇళ్ల వద్ద ప్రధాన రహదారుల్లో పలు చోట్ల ఆ పార్టీ కార్యకర్తలు బాణసంచా పేల్చారు. దీనివల్ల కొన్ని చోట్ల వాహనదారులకు ఇబ్బందులు తలెత్తాయి. మద్యం విక్రయాలపై నిషేధం ఉన్నప్పటికీ జనసేన, టీడీపీ కార్యకర్తలు వాహనాల్లో నగరమంతా పర్యటిస్తూ మద్యం మత్తులో పాదచారులను, వాహనదారులను హడలెత్తించారు. రాజ్‌విహార్ నుంచి నంద్యాల చెక్‌పోస్టు వరకు ఈలలు, కేకలు వేస్తూ వాహనాలపై చక్కర్లు కొట్టారు. దీంతో ఆయా మార్గాల గుండా వెళ్లే వాహనదారులు విసుక్కోవడం కనిపించింది.

ఆదోని అర్బన్: విజయోత్సవాలు నిర్వహించకూడదని పోలీస్ ఆదేశాలను ఆదోని పట్టణంలో కూటమి కార్యకర్తలు పట్టించుకోలేదు. బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథి గెలుపొందడంతో పట్టణంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బైకుపై ర్యాలీ నిర్వహించారు. 144 సెక్షన్, 30 పోలీస్‌యాక్ట్ అమలులో ఉన్నా కూడా టీడీపీ నాయకులు ఉల్లంఘించారు.

మూడోసారి వైఎస్సార్‌సీపీ విజయం



ఆలూరు: ఆలూరు నియోజకవర్గంలో వరుసగా మూడోసారి వైఎస్సార్‌సీపీ విజయాన్ని అందుకుంది. ఇప్పటి వరకు ఇక్కడ 16 సార్లు ఎన్నికలు జరిగాయి. 2009లో ఈ నియోజకవర్గం ఎస్సీ రిజర్వ్ స్థానం నుంచి జనరల్ కేటగిరికి మారింది. 2014లో జరిగిన ఎన్నికల్లో అప్పటి టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడుపై 1,919 ఓట్ల మెజార్టీతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం గెలుపొందారు. అలాగే 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కోట్ల సుజాతమ్మపై 39,896 ఓట్ల మెజార్టీతో వైఎస్సార్‌సీపీ తరఫున గుమ్మనూరు జయరాం విజయం సాధించారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడుపై వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బుసినె విరూపాక్షి 2,831 ఓట్ల మెజార్టీతో జయకేతనం ఎగురవేశారు.

విజేతలకు డిక్లరేషన్ పత్రాల అందజేత



ఆలూరు ఎమ్మెల్యేగా విజయం సాధించిన విరూపాక్షికి డిక్లరేషన్ పత్రాన్ని అందిస్తున్న ఆర్వో

కర్నూలు (అర్బన్): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో భాగంగా విజయం సాధించిన పార్లమెంట్, శాసనసభ అభ్యర్థులకు సంబంధిత రిటర్నింగ్ అధికారులు డిక్లరేషన్ పత్రాలను అందించారు. ఓట్ల లెక్కింపు జరిగిన రాయలసీమ విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో కర్నూలు ఎంపీగా విజయం సాధించిన బస్తిపాటి నాగరాజుకు జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన డిక్లరేషన్ పత్రాన్ని అందించారు. పాణ్యం, ఆదోని, కర్నూలు, పత్తికొండ, మంత్రాలయం, ఆలూరు, కోడుమూరు, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో గెలుపొందిన గౌరు చరిత, డాక్టర్ పార్థసారధి, టీజీ భరత్, కేఈ శ్యాం బాబు, వై.బాలనాగిరెడ్డి, బూసినె విరుపాక్షి, బొగ్గుల దస్తగిరి, బీవీ జయనాగేశ్వరరెడ్డికి సంబంధిత రిటర్నింగ్ అధికారులు డిక్లరేషన్ పత్రాలను అందించారు.

నీట్‌లో మెరిసిన చిన్నటేకూరు ఆణిముత్యాలు

కర్నూలు (అర్బన్): నీట్-2024 పరీక్ష ఫలితాల్లో చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ మెడికల్ అకాడమీ విద్యార్థులు తమ ప్రతిభను చాటారని ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఉమ్మడి కర్నూలు జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఐ.శ్రీదేవి తెలిపారు. ఈ విద్యాసంస్థల్లో మొత్తం 52 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా విద్యార్థులందరూ అర్హత సాధించారని ఆమె మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ర్యాంకులు సాధించిన వారిలో వి.త్రినాథ్ నాయక్ (2,058), మల్లేష్ నాయక్ (2,711), మహేంద్ర నాయక్ (3,788), పి.దినేష్ (4,126), పి.అరుణ్‌కుమార్ (5,516), బి.అబ్రహాం (5,787), డి.చండీమల్ (6,024), హనుమాన్ నాయక్ (6,074), అద్భుత్ కుమార్ (6,994), సునిల్ కుమార్ (7,101), ఎస్.కిషోర్ (7,756), ఎం.శ్రీధర్ (7,817), పి.రాజా (9,671) ఉన్నారని తెలిపారు. మొత్తం 20 మందికి ఎంబీబీఎస్ సీట్లు సాధించేందుకు ర్యాంకులు వచ్చాయని డీసీఓ తెలిపారు.

కోసిగిలో భారీ వర్షం



ఉధృతంగా ప్రవహిస్తున్న ఉత్తుత్తి వాగు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. కోసిగిలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాగు, వంకలు పొంగి పొర్లాయి. రైల్వే గేటు దాటి తర్వాత ఉరుకుంద ఆర్చ్ వద్ద ఉత్తుత్తి వాగు వద్ద పొంగి పొర్లడంతో దాదాపు గంటకు పైగా రాకపోకలు నిలిచిపోయాయి. కోసిగి సీఐ ప్రసాద్, ఎస్ఐ సతీష్ కుమార్‌లు వంక వద్దకు చేరుకుని పరిస్థితి సమీక్షించారు. వర్షపు నీరు తగ్గేంత వరకు వాహనాలు దాటకుండా చర్యలు తీసుకున్నారు. వాగు ఉధృతి తగ్గిన తర్వాత యదావిధిగా వాహనాల రాకపోకలు సాగాయి.

క్లుప్తంగా

యువకుడిపై టీడీపీ నాయకుల దాడి



గాయపడిన మహేష్

బొమ్మలసత్రం: వీధిలో వెళ్లే మహిళలపై నిప్పురవ్వలు పడుతున్నాయని టపాకాయలు కాల్చవద్దని కోరిన మహేష్‌పై టీడీపీ నాయకులు దాడి చేసి చితకబాదిన ఘటన మంగళవారం నంద్యాలలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు.. తెలుగుపేటకు చెందిన మహేష్ రేషన్ బియ్యం సరఫరా వాహనం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకులు తమ పార్టీ విజయం సాధించిందన్న సంతోషంలో వీధుల్లో టపాకాయలు పేల్చడం ప్రారంభించారు. ఈక్రమంలో మహిళలు అటుగా వెళ్తుండటంతో టపాకాయలు పేల్చవద్దని మహేష్ కోరాడు. దీంతో కోపోద్రిక్తులైన టీడీపీ శ్రేణులు శేఖర్, శ్రీనివాసులు, వెంకట్ దాడికి పాల్పడ్డాడు. స్థానికులు అడ్డుకుని బాధితున్ని రక్షించారు. బాధితుడు టీడీపీ నాయకులపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

వివాహిత ఆత్మహత్య



సుమలత మృతదేహం

బనగానపల్లె రూరల్: మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన వివాహిత బలిజ సుమలత(21) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ తిరుపాల్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన శ్రీకాంత్ భార్య సుమలత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధ పడుతూ ఉండేది. పలువురి వైద్యుల వద్ద చూపించినా నయంకాకపోవడంతో పాటు నొప్పి తీవ్రం కావడంతో జీవితంపై విరక్తిచెంది మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి రెండేళ్ల కూతురు ఉంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వికసించిన మే పుష్పం



ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణం సమీపం మండగిరి గ్రామ పంచాయతీ పరిధిలోని శాంతి ఎస్టేట్‌లో నివాసముంటున్న ఉపాధ్యాయురాలు ఎం.సుశీలమ్మ ఇంటి ఆవరణలో మంగళవారం మే పుష్పం వికసించింది. ప్రతి ఏడాది మే మాసంలో వికసించాల్సిన పుష్పం, కొంత ఆలస్యంగా జూన్ మాసంలో పుష్పం వికసించింది. ఈ పుష్పం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.

చూస్తూ ఉంటే చూపుండదు జాగ్రత్త!

- సెల్‌ఫోన్, కంప్యూటర్ అతి వాడకంతో ఇబ్బందులు
- చిన్న వయస్సులోనే దృష్టి లోపాలు
- పెరుగుతున్న దూరదృష్టి సమస్య
- కంటి వైద్యుల వద్దకు క్యూకడుతున్న యువత

ఎక్కడైనా పది మంది ఉంటే అందులో అధిక శాతం కూర్చుని మాట్లాడటం గాకుండా సెల్‌ఫోన్‌ను తదేకంగా చూస్తూ ఉంటారు. చివరకు బస్సు ప్రయాణం, వివాహాది శుభకార్యాలకు వెళ్లినా కాసేపు మాట్లాడి ఆ తర్వాత సెల్‌ఫోన్‌లో నిమగ్నమైపోతున్నారు. ఇంట్లో ఉన్నా బయట ఉన్నా, భోజనం చేస్తున్నా సెల్‌ఫోన్‌పైనే ధ్యాస. గంటల తరబడి మొబైల్ చూడటం, కంప్యూటర్ స్క్రీన్‌కు అతుక్కుపోవడం వల్ల కళ్ల సమస్యలతో డాక్టర్లను సంప్రదించే వారి సంఖ్య పెరుగుతోంది. మొబైల్, కంప్యూటర్ తెరలు తదేకంగా చూడటం వల్ల నీలికాంతి(బ్లూలైట్) కళ్లను విపరీతంగా దెబ్బ తీస్తోందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

– కర్నూలు(హాస్పిటల్)

జిల్లాలో కర్నూలు, నంద్యాల, ఆదోని ప్రాంతాల్లో 60 మందికి పైగా కంటి వైద్యులున్నారు. వీరి వద్దకు నిత్యం 10 నుంచి 20 మంది వరకు ఇలాంటి కంటి సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. వీరి అంచనా మేరకు జనాభాలో 60 శాతం ప్రజలు రోజులో 6 గంటలకు పైగా సెల్‌ఫోన్ చూస్తున్నారు. యువతీయువకులు అయితే రోజులో 10 గంటలకు పైగా స్క్రీన్‌నే చూస్తున్నారు. ఇలా సెల్‌ఫోన్‌కు బానిస కావడం వల్ల ఒక్కోసారి వారికి తెలియకుండానే వారి చేతి వేళ్లు సెల్‌ఫోన్‌పైకి వెళ్తుంటాయి. ఒకప్పుడు పగలంతా పనులు చేసుకుని సూర్యాస్తమయం ముందే తినేసి, రాత్రి చీకటి పడగానే పడుకునేవారు. సూర్యుడి కాంతి మాత్రమే మనకు కనిపించేది. ఇప్పుడు మొబైల్ ఫోన్లు, టీవీలు, కంప్యూటర్లు, ల్యాబ్‌టాప్‌లలోని కృత్రిమకాంతిలో ఉండే బ్లూలైట్ వల్ల కంటికి కొత్త చిక్కులు వచ్చి పడుతున్నాయి.

కంప్యూటర్ విజన్ సిండ్రోమ్


కంప్యూటర్ విజన్ సిండ్రోమ్‌ను డిజిటల్ ఐ స్ట్రెయిన్ అంటారు. ఇది ఎక్కువ కాలం కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, టీవీలు చూసినందు వల్ల వస్తుంది. కళ్లు ఒత్తిడికి గురికావడం, కళ్లు అలసిపోవడం, కళ్ల మంటలు, కళ్లు ఎరుపు కావడం, ఒక వస్తువు రెండుగా కనిపించడం, కళ్లు పొడిబారడం, నల్లగుడ్డ పొడిబారడం, మయోపియా ఎక్కువ కావడంలాంటి లక్షణాలు ఉంటాయి.

కారణాలు

- డిజిటల్ పరికరాలు విస్తృతంగా వినియోగించడం
- రెండు గంటల కన్నా ఎక్కువగా కంప్యూటర్ తదేకంగా చూడటం
- కంప్యూటర్‌లో అక్షరాలను తదేకంగా చూడటం వల్ల కళ్లు ఒత్తిడికి గురవుతాయి

తదేకంగా చూడటమే అసలు సమస్య

ఒకప్పుడు పిల్లలు కాసేపు స్మార్ట్‌ఫోన్ లేదా టీవీ చూస్తేనే గంటల తరబడి అలా చూస్తే కళ్లుపోతాయని దండించేవారు. కానీ ఇప్పుడు టిఫిన్, భోజనం తినిపించాలన్నా వారికి ఫోన్ చూపిస్తూ తినిపించాల్సిందే. ఈ అలవాటు రాత్రిళ్లు వారు అర్ధరాత్రి వరకు చూస్తూనే గడుపుతున్నారు. వీరితో పాటు పెద్దలూ మొబైల్‌ఫోన్‌కు బానిసలై రాత్రింబళ్లు చూస్తున్నారు. మరోవైపు వర్క్‌ఫ్రమ్ హోమ్ కారణంగా ఇంటి నుంచి నిరంతరం కంప్యూటర్ వర్క్ చేసే వారికి సైతం కంటి జబ్బులు అధికమయ్యాయి.



మొబైల్ ఫోన్ చూస్తున్న యువతి

- స్క్రీన్ కాంట్రాస్ట్ ఎక్కువగా ఉండటం
- సాధారణంగా నిమిషానికి 18 నుంచి 20 సార్లు రెప్ప వాల్చాలి. కానీ కంప్యూటర్ చూసే వారికి ఇది 3 నుంచి 6 సార్లకు పడిపోతుంది.
- దీనివల్ల కళ్ల ఉపరితలం పొడిబారుతుంది

వ్యాధినిర్ధారణ

- కంప్యూటర్‌తో గడిపే సమయం
- కంప్యూటర్లు చూసేటప్పుడు కూర్చునే భంగిమలు
- ఇతర వైద్యకారణాలు(డ్రగ్ రియాక్షన్, కీళ్లనొప్పులు)
- మైబోమియా గ్లాండ్ పరీక్ష

చికిత్స, నివారణ

- కళ్లకు తేమను కలిగించే కృత్రిమ కన్నీళ్లు తరచుగా వాడటం
- కళ్లరెప్పలను తరచుగా మూసుకోవడం
- దృష్టిలోపాలకు వాడే అద్దాలు బ్లూఫిల్టర్‌తో వాడటం
- స్క్రీన్ టైమ్ తగ్గించుకోవడం
- ప్రతి 20 నిమిషాలు కంప్యూటర్‌పై ఉన్నప్పుడు 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును 20 సెకన్లు వీక్షించాలి
- కంప్యూటర్, సెల్‌ఫోన్ స్క్రీన్ బ్రైట్‌నెస్, కాంట్రాస్ట్ సర్దుబాటు చేసుకోవాలి
- కంప్యూటర్, సెల్‌ఫోన్‌లో ఫాంట్(వచనం)ను పెద్దదిగా(జూమ్) చేయాలి
- సంవత్సరానికి ఒకటి, రెండుసార్లు డ్రై ఐ గురించి నేత్ర వైద్యులను సంప్రదించాలి

కంటి సమస్యలు రాకూడదంటే..

- ప్రతి అరగంటకు ఒకసారి మొబైల్/ కంప్యూటర్/ల్యాప్‌టాప్ నుంచి రెండు మూడు నిమిషాలైనా దృష్టిని వేరేవైపునకు మరల్చాలి.
- కంటికి స్క్రీన్‌ను 25 నుంచి 40 అంగుళాల దూరం ఉంచాలి.
- యాంటిగ్లేర్, యాంటి రిఫ్లెక్టివ్ అద్దాలను వాడితే కంటికి రక్షణగా ఉంటుంది. ఇవి అధిక కాంతిని కళ్లపై పడకుండా అడ్డుకుంటాయి.
- కళ్లు మంటలు, నీరుకారడం వంటి సమస్యలుంటే కాసేపు తెరను చూడటం ఆపేయాలి.
- తరచూ చల్లని నీటితో కళ్లు కడుక్కోవాలి. రాత్రి నిద్రించే సమయంలో కళ్లపై కాసేపు తడివస్త్రాన్ని కప్పి ఉంచాలి.
- కంటికి కసరత్తులు సైతం అవసరం. ఇందు కోసం కళ్లను కుడి, ఎడమలకు అరనిమిషం నుంచి నిమిషం పాటు తిప్పాలి. రెండు అరచేతులు రుద్దుకుని వేడెక్కిన తర్వాత కళ్లపై కాసేపు ఉంచే కసరత్తు చేయాలి.

నీలి కాంతితో కంటికి సమస్యలు



కంప్యూటర్, సెల్‌ఫోన్‌లను తదేకంగా ఎక్కువసేపు చూడటం వల్ల అందులోని నీలికాంతి కళ్లపై పడి కళ్లు దెబ్బతింటున్నాయి. ఇటీవల కాలంలో మా వద్దకు కంటి జబ్బులతో వస్తున్న వారిలో కళ్లు పొడిబారడం వంటి సమస్యలతో 20 నుంచి 30 శాతం మంది వస్తున్నారు. వచ్చిన వారు అధికంగా కళ్లు పొడిబారడం, కళ్లు ఎర్రగా కావడం, కళ్ల మంటలు, కంట్లో దురద వంటి సమస్యలు ఉంటున్నాయి. మొబైల్ ఫోన్‌లు, కంప్యూటర్ తెరలను ఎక్కువసేపు చూడటం ఈ సమస్య అధికమవుతోంది.

– డాక్టర్ పి.సుధాకర్‌రావు, సీనియర్ కంటి వైద్యనిపుణులు, కర్నూలు

బ్లూ లైట్‌తో కళ్లకు ప్రమాదం

మొబైల్ ఫోన్‌లో ఉండే నీలి కాంతి కళ్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మొబైల్‌లో కాంతి ఎక్కువగా పెట్టుకుని చూడటం వల్ల వాటిలోని రేడియేషన్, అల్ట్రావైలట్ రేస్ వల్ల కళ్లలో నీళ్లింకిపోయి పొడిబారుతున్నాయి. విద్యార్థులు, యువకులు మొబైల్/కంప్యూటర్/ల్యాప్‌టాప్‌ను దగ్గర నుంచి చూడటం వల్ల క్రమంగా వారికి మయోపియా(దూరంగా ఉన్నవి కనిపించవు) సమస్య వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా దృష్టిలోపం ఉండే వారిలో ఏడాది నుంచి రెండేళ్లకు వారి కంటి అద్దాల నెంబర్ మారుతుంది. కానీ ఎక్కువసేపు ఆన్‌లైన్ క్లాస్‌ల కారణంగా తక్కువ సమయం(ఆరు నెలల్లోనే)లో కంటి అద్దాల నెంబర్ మారుతోంది. దీనికితోడు వర్క్‌ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ క్లాసుల పేరుతో ఉదయం నుంచి సాయంత్రం వరకు తదేకంగా తెరలను చూడటం వల్ల కంటి కండరాలపై ఒత్తిడి పెరిగి సాయంత్రం వేళ తలనొప్పి వస్తుంది.

నకిలీ విపత్తు లేకుండా..

- ల్యాబ్‌లలో విత్తనాలు, ఎరువుల పరీక్షలు
- నియోజకవర్గానికి ఒక ల్యాబ్ ఏర్పాటు
- అందుబాటులో అత్యాధునిక పరికరాలు
- 2023–24లో ఉమ్మడి జిల్లాలో 8,412 పరీక్షలు



కోడుమూరు నియోజకవర్గం గూడూరులో నిర్మించిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్

కర్నూలు(అగ్రికల్చర్): విత్తనం మంచిదైతే పంట పండుతుంది. లేదంటే రైతు తీవ్రంగా నష్టపోతారు. ఖరీఫ్ ప్రారంభమైన నేపథ్యంలో నాణ్యతను పరీక్షించుకోవాల్సి ఉంది. ఇందుకోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక అగ్రి ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. వీటిని రైతులు చక్కగా సద్వినియోగం చేసుకుంటున్నారు. 2023–24లో కర్నూలు జిల్లాలో 4,521, నంద్యాల జిల్లాలో 3,891 శ్యాంపుల్స్ ప్రకారం మొత్తం 8,412 శ్యాంపుల్స్‌ను పరీక్షించారు. గతంలో నాణ్యతను ధ్రువీకరించుకునే అవకాశం లేకపోవడంతో ఆకర్షణీయమైన ప్యాకెట్లను చూసి రైతులు మోసపోయేవారు. పైరు బాగా ఎదిగి పూత, పిందె సమయానికి అది నకిలీదని తేలుతుండటంతో లబోదిబోమనేవారు. నష్టాలు మూట కట్టుకుట్టుకునేవారు. ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం మినహా మిగిలిన 13 నియోజ వర్గాల్లో డాక్టర్ వైఎస్ఆర్ అగ్రీ టెస్టింగ్ ల్యాబ్‌లు ఉన్నాయి. ల్యాబ్‌ల్లో రైతులు విత్తనాలు, ఎరువుల శాంపుల్స్‌ను తీసుకెళ్లి ఉచితంగా నాణ్యతను ధ్రువీకరించుకోవచ్చు.

అత్యాధునిక పరికరాలతో పరీక్షలు....

ఆర్ఐడీఎఫ్ నిధులతో రూ.9.13 కోట్లతో మూడేళ్ల క్రితం నియోజకవర్గాల వారీగా వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రీ ల్యాబ్‌లు నిర్మించారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలను కూడా వీటిల్లోనే నిర్వహిస్తున్నారు. వీటిలో అధునాతన పరికరాలు ఉన్నాయి. ల్యాబ్‌లో నాణ్యతను ధ్రువీకరించుకున్న తర్వాత విత్తనాలు, ఎరువులకు సంబంధించి ఒక్క ఫిర్యాదు కూడా లేకపోవడం విశేషం.

ఏఏ పరీక్షలు చేస్తారంటే....

నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన ల్యాబ్‌ల్లో ఎరువులు, విత్తనాల నాణ్యత ప్రమాణాలపై పరీక్షలు చేస్తారు. పురుగుమందుల నాణ్యతా ప్రమాణాలను జిల్లా స్థాయి ల్యాబ్‌లో పరీక్షిస్తారు. విత్తనాలకు సంబంధించి మొలకశాతం(జర్మినేషన్), భౌతిక నాణ్యత(ఫిజికల్ ప్యూరిటీ), తేమ(మాయిశ్చర్) శాతాలను పరీక్షించి నిర్ధారిస్తారు. కెమికల్స్‌ఫర్టిలైజర్స్‌లో ఒకే పోషకం, రెండు పోషకాలు, మూడు పోషకాలులతో పాటు సూక్ష్మ పోషకాలను పరీక్షిస్తారు. బయోఫర్టిలైజర్ నాణ్యతా ప్రమాణాలు, ఆర్గానిక్ ఫర్టిలైజర్స్, డీ- ఆయిల్డ్ కేక్ నాణ్యత ప్రమాణాలపై కూడా పరీక్షలు నిర్వహిస్తారు. పురుగుమందుల నాణ్యత ప్రమాణాలను కూడా పరీక్షిస్తారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2023–24లో దాదాపు ఎనిమిది వేలకుపైగా శ్యాంపుల్స్‌ను పరీక్షించి నాణ్యత ప్రమాణాలను ధ్రువీకరించారు. ప్రతి ల్యాబ్‌లో ప్రభుత్వం శిక్షణ పొందిన వ్యవసాయ అధికారులు పనిచేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 13 ల్యాబ్‌ల్లో వేలాదిగా శ్యాంపుల్స్‌ను పరీక్షించి ఫలితాలు ఇచ్చారు. రైతుల నుంచి ఎటువంటి ఫీజు తీసుకోకుండా ఎరువులు, విత్తనాల శ్యాంపుల్స్ తీసుకుని పరీక్షిస్తారు.

నకిలీలపై తగ్గిన ఫిర్యాదులు

నియోజక వర్గాల వారీగా ల్యాబ్‌లు ఏర్పాటు కాక ముందు నకిలీలు వెల్లువెత్తాయి. ఏటా వందలాది ఫిర్యాదులు రైతుల నుంచి వెల్లువెత్తేవి. ల్యాబ్‌లు ఏర్పాటైన తర్వాత ముందుగానే నాణ్యతా ప్రమాణాలను నిర్ధారించుకునే అవకాశం ఉండటం, వేలాది మంది రైతులు ల్యాబ్‌లను వినియోగిస్తుండటంతో నకిలీలపై ఫిర్యాదులు తగ్గిపోయాయి.

2023-24లో ఉమ్మడి జిల్లాలోని ల్యాబ్‌లు. వాటిల్లో పరీక్షించిన శ్యాంపుల్స్ వివరాలు

జిల్లా	మొత్తం ల్యాబ్‌లు	పరీక్షించిన శ్యాంపుల్స్
కర్నూలు	6	4,521
నంద్యాల	7	3,891
మొత్తం	13	8,412

గతంలో బీటీ పత్తి, మొక్కజొన్న, మినుము, కందులు, వరి తదితర పంటల సాగకు సంబంధించి నకిలీలతో రైతులు నష్టపోయారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన రైతులు బీటీ పత్తి విత్తనాల్లో నకిలీల బారిన పడి తీవ్రంగా నష్టపోయారు. కావేరి సీడ్ కంపెనీకి చెందిన నాసిరకం కావేరి జాదు విత్తనాలతో రైతులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నారు. నియోజకవర్గం వారిగా వైఎస్ఆర్ అగ్రీ టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు కావడంతో విత్తనాల నాణ్యతా ప్రమాణాలను ఎక్కడికక్కడ తనిఖీ చేసుకునే అవకాశం ఏర్పడింది.

విత్తనం నాణ్యమైనదైతే పంట బాగా వస్తుంది

విత్తనం మంచిదైతే పంట ఏపుగా పెరుగుతుంది. మంది దిగుబడులను కూడా ఇస్తుంది. మార్కెట్‌లో నేడు ఏ విత్తనం తీసుకున్న అనేక కంపెనీలు, అనేక విత్తనాలు వెల్లువెత్తుతున్నాయి. ఏ విత్తనం కొనుగోలు చేసినప్పటికి ముందు జాగ్రత్త చర్యగా విత్తనం నాణ్యతను తనిఖీ చేసుకోవడం అత్యవసరం. విత్తనం మంచిది కాకపోతే మొలక సరిగా రాదు. ఎరువు మంచిది కాకపోతే పంట పెరుగుదలలో తేడాలు వస్తాయి. పురుగుమందులో కల్తీ ఉంటే పంటల్లో సమస్యలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. నకిలీలు, కల్తీలకు తావు లేకుండా ప్రభుత్వం నియోజకవర్గం వారిగా వైఎస్ఆర్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసింది. రైతులు తాము కొనుగోలు చేసిన విత్తనాల నాణ్యతా ప్రమాణాలను ముందుజాగ్రత్తగా ల్యాబ్‌ల్లో తనిఖీ చేసుకోవచ్చు.



విత్తనాల నాణ్యత ప్రమాణాలపై వైఎస్ఆర్ అగ్రి ల్యాబ్‌లో పరీక్ష చేస్తున్న దృశ్యం

నాణ్యతను ధ్రువీకరించుకోవచ్చు

ఎరువులు, విత్తనాల నాణ్యతా ప్రమాణాలను ముందుగానే ధ్రువీకరించుకోవడం అవసరం. ఖరీఫ్ సీజన్ మొదలైంది. విత్తనాల నాణ్యతను ధ్రువీకరించుకొని విత్తనం వేసుకుంటే చాలా వరకు సమస్యలు రాకుండా చేసుకోవచ్చు. వ్యవసాయ శాఖకు నియోజక వర్గాల వారీగా ల్యాబ్‌లు ఉన్నాయి. వీటిల్లో విత్తనాలు, ఎరువుల నాణ్యత ప్రమాణాలను ఉచితంగా ధ్రువీకరించుకోవచ్చు. రైతులు విత్తనాలు, ఎరువుల శ్యాంపుల్స్ తీసుకెళ్తే ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తాయి. లూజు విత్తనాలకు మాత్రం పరీక్షలు చేయడం జరుగదు. ల్యాబ్‌ల్లో విత్తనాల్లో మొలక శాతం, తేమ శాతం, విత్తనం స్వచ్ఛతను ధ్రువీకరిస్తారు.

–పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి, కర్నూలు

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



రంగన్న (ఫైల్)

దేవనకొండ: మండలంలోని నేలతలమరి గ్రామానికి చెందిన ఉపాధి కూలీ రంగన్న (60) చెక్‌డ్యాం పనులు చేస్తుండగా గుండెపోటుకు గురై కుప్పకూలి పడిపోయాడు. గమనించిన తోటి కూలీలు రంగన్నను దేవనకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

టమాట @40 పైమాటే



హొళగుంద: కొద్ది రోజుల క్రితం కిలో టమాట రూ.15 ఉండగా నేడు రూ.40 దాటింది. వర్షాలు ఎక్కువైతే మరింత పెరిగే అవకాశాలున్నాయి. మండలంలో కూరగాయల సాగు తగ్గడం, టమాట పండించకపోవడం, ఎండా కాలంలో కూడా పంటల సాగు లేకపోవడంతో కాయగూరల ధరలు పెరగడానికి కారణమని వ్యాపారులు చెబుతున్నారు. వ్యాపారులు ఇతర పట్టణ ప్రాంతాల నుంచి కొని ఇక్కడికి తెచ్చి అమ్ముతున్నారు. పట్టణాల్లోని దళారులు కృత్రిమ కొరతను సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారు. టమోట, మిరప ధరలను అమాంతంగా పెంచేశారు. ధరలను చూసి పేద, మధ్య తరగతి ప్రజలు కొనలేకపోతున్నారు. మండలంలో టమాటను మదనపల్లి నుంచి, మగిలిన కూరగాయలను ఆదోని, గుంతకల్ నుంచి దిగుబడి చేసుకుంటున్నారు.

పిడుగుపాటుకు బాలుడి మృతి

- మరో బాలుడికి గాయాలు



మృతి చెందిన రంజిత్ (ఫైల్)

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో మంగళవారం సాయంత్రం పిడుగుపాటుకు కొంచిగారి రంజిత్ (15) అనే బాలుడు మృతి చెందాడు. వీరేష్ అనే మరో బాలుడు గాయపడ్డాడు. గ్రామానికి చెందిన కొంచిగారి చిన్న బసప్ప, రాధమ్మకు ఇద్దరు కుమారులు. వారిలో చిన్నవాడైన రంజిత్ పదో తరగతి పాసైయ్యాడు. మంగళవారం సాయంత్రం చినుకులు పడుతుండడంతో వీరేష్‌తో కలసి ఊరు వాకిలి వద్దకు వెళ్లి ఆడుకుంటుండగా పెద్ద శబ్దంతో పిడుగు పడింది. దీంతో ఇద్దరు పిల్లలు పడిపోయారు. గమనించిన గ్రామస్తులు వెంటనే వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే రంజిత్ మృతి చెందాడు. గాయపడిన వీరేష్‌ను చికిత్స కోసం గుంతకల్లుకు తీసుకెళ్లారు.

నందీశ్వరుడికి ప్రదోష కాల అభిషేకం

మహానంది: మహానందిలో కొలువైన శ్రీనందీశ్వరస్వామికి మంగళవారం ప్రదోష కాలంలో అభిషేకం, అర్చన పూజలు వైభవంగా జరిగాయి. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, ఉప ప్రధాన అర్చకులు జనార్ధన్‌శర్మ, రుత్వికుల బృందం విశేష పూజలు చేశారు. ముందుగా స్వామి వారికి గణపతి పూజ, పీఠార్చన, అనంతరం విశేష ద్రవ్యాలతో, పలు రకాల ఫలాలతో అభిషేకం చేపట్టారు. పలు ప్రాంతాల భక్తులు అభిషేకంలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేసుకున్నారు.



నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న దృశ్యం

ఇది మల్లెల వేళయనీ..!



తోపుడు బండిపై మల్లెలను విక్రయిస్తున్న దృశ్యం

- మల్లెపూల సీజన్
- మార్కెట్‌లో ముంచెత్తుతున్న పూలు

ఎమ్మిగనూరుటౌన్: మగువల మనసు దోచుకునే మల్లెలు ప్రస్తుతం మార్కెట్‌లో గుబాళిస్తున్నాయి. ఎమ్మిగనూరు పట్టణంలోని పూల దుకాణాల్లో దండలు కట్టి, రాశులుగా పోసి విక్రయిస్తున్నారు. తోపుడు బండ్లపై మల్లెలు రాశులు కనువిందు చేస్తున్నాయి. సువాసనలను వెదజల్లుతున్న మల్లెలు మహిళల చూపును తమవైపునకు మళ్లించుకుంటున్నాయి. కర్నూలు, కోడుమూరు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుండి పట్టణానికి మల్లెలు విరివిగా వ్యాపారులు తెచ్చి విక్రయిస్తున్నారు. పూల జడలకు, దండలకు డిమాండ్ పెరిగింది. దీంతో పూల జడలకు మల్లెలతో పాటు పలురకాల పూలు జోడించి అలంకరణ చేసుకుంటున్నారు. కిలో మల్లెపూలు నాణ్యతను బట్టి రూ.100 నుంచి రూ.200కు పైగా పలుకుతున్నాయి. తోపుడు బండ్లపై పావు పూలు రూ.10కే ఇస్తుండటంతో మగువలు వాటిని కొనకుండా ఉండలేకపోతున్నారు. మగువలు విరివిగా కొనుగోలు చేస్తుండటంతో మల్లెలు, చిన్న గులాబీ పూల వ్యాపారం గుబాళిస్తోందని వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.